# అభాగిని లలిత

"కృష్ణారావూ! విశ్వాసరావు భార్య లలిత సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుందట విన్నావా?" అన్నాను నేను సిగరెట్టు పీలుస్తూ వాలుకుర్చీలో కూర్చున్న నా స్నేహితుడితో. కాని వాని ముఖంలో ఏ మాత్రమూ ఆశ్చర్య చిహ్నాలు కనబడలేదు..

"ఇస్.. ఇల్లా జరుగుతుందని నేను మొట్టమొదటినుంచీ అనుకున్నా" నన్నాడు.

నాకాశ్చర్యం వేసింది. "ఏ కారణంవల్ల అనుకున్నావు? నీకామె గురించి కొంత తెలిసి నట్లుంది. నాకు చెప్పు.

కృష్ణారావు కొంతసేపాలోచించి ఇలా చెప్పాడు.

"లలితని దాదాపు పాతిక సంవత్సరాల నుంచి నేను ఎరుగుదు. అప్పుడామెకి పదిహేను సంవత్సరాలు. నిండు యవ్వనంలో వుంది. గొప్పవారింటి బిడ్డ. ఏ విధంగానూ ఆమెకు లోపం లేదు. అప్పటికప్పుడే తల్లిదండ్రులు పెళ్లి గురించి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ సమయంలో కొన్ని సంఘటనలు జరిగాయి. మధుసూదనుడనే స్నేహితుడు నాకొకడు వుండేవాడు. వాని గురించి తలచుకుంటే నా కళ్లు చెమ్మగిల్లుతాయి. అదొక విధమైన విచారం నన్ను మ్రింగేస్తూ వుంటుంది. వానిని మరచిపోదామని చూస్తాను. కాని మరపునకు రాడు. పుట్టడం బీద కుటుంబంలో పుట్టేడు. కాని గుణాల్లో హరిశ్చంద్రుడంతటివాడు. ఎన్నో కష్టాలు గట్టెక్కి బి.ఏ. వరకు వచ్చేడు. ఒకనాడు లలితను ఏదో సందర్భంలో కలుసుకున్నాడు. చూచీ చూడటంతో వాని మనస్సు ఆమెయందు లగ్నమయింది. ఆమె కూడా వీనిని ప్రేమించింది. ఆమె తల్లిదండ్రులకి తెలియకుండా యిద్దరూ అనేక పర్యాయాలు రహస్యంగా కలుసుకున్నారు. కాని ఈ రహస్యం ఎన్నాళ్లు దాగుతుంది? అందులోను లోకులు లలితా మధుసూదనుల గురించి అనేక విధాలుగా చెప్పుకోసాగేరు. అది ఆనోటా ఆనోటా లలిత తల్లిదండ్రుల చెవిని పడ్డది. తండ్రి ఆగ్రహంతో కొట్టేడని కూడా విన్నాను. తల్లిదింకా సాధు స్వభావం. కుమార్తెని పిలిచి నచ్చచెప్పింది తొందరపాటుతో ఏ పనీ చెయ్యవద్దని. మధుసూదనుడు బీదవాడు. భార్యని ఎలాగ పోషించగలడు? ఆమె కోరికలేమీ తీర్చలేడు. ధనం లేనిదే ఏవిధంగా సౌఖ్యపెట్ట గలడు? లలితకు బోధనలన్నీ బాగా నాటేయి. అవును; నిజమే. మధుసూదనుడు తనను ఏవిధంగా పోషించగలడు? వానిని ప్రేమిస్తే ప్రేమించింది. కాని పెళ్లాడి తిండిలేక చావగలదా?

కొద్దిరోజుల్లోనే ఈ విశ్వాసరావుకిచ్చి వివాహం చేయడం స్థిరపడ్డది. మధుసూదనకీ భోగట్టా తెలిసింది. తన చెవులని తనే నమ్మలేక పోయాడు. లలిత తననింత అన్యాయం చేస్తుందా అనుకున్నాడు. ఆమెని ఒకనాటి సాయంకాలం కలుసుకుని విశ్వాసరావును పెళ్లి చేసుకోవడం నిజమేనా అని ప్రశ్నించాడు. లలిత సమాధానం చెప్పలేదు. అవునని మెల్లగా

సంజ్ఞ చేసింది. దానితో మధుసూదనుని ఆకాశ హర్మ్యాలన్నీ నేలమట్టమయిపోయేయి. ఆ సాయంకాలం అస్తమిస్తున్న సూర్యుడిలాగే వాని ఆశలన్నీ అస్తమించేయి.

లలితా విశ్వాసరావుల వివాహం జరిగిపోయింది. అప్పటినుంచే మధుసూదనుడు పాడైపోయేడు. వానిలో వున్న ఉత్సాహమంతా అడుగంటిపోయింది. దిక్కులేని పక్షిలాగా ఊరల్లా తిరిగేవాడు. చదవడం మానివేయడం వల్ల బి.ఎ. ప్యాసు కాలేకపోయాడు. అటు తర్వాత క్రమంగా మంచం పట్టేడు. లేవడానికి శక్తి లేదు. రోజూ జ్వరం తగుల్తూంది. చేతిలో పైసా లేదు. రెండు రోజులు త్రాగడానికి మంచినీరిచ్చే వారు లేక పడివున్నాడంటే నమ్ము. ఈ విషయం తెలిసి ప్రతిదినం వెళ్లి నేను ఉపచారాలు చేసేవాడిని. డాక్టర్ని తీసుకువచ్చి చూపించేను. ఏమీ లాభం లేదని పెదవి విరిచి వెళ్లిపోయాడు. ఇటువంటి స్థితిలో వున్నా ఇతర స్నేహితులలో ఒక్కరైనా రాలేదు. కొందరు తినడానికి లేనివాడికి ప్రేమ ఏమిటని పరిహాసం చేసేరు. కొందరు నటన అన్నారు. లోకంలో బీదవాడవడంతోటే ఎన్ని కష్టాలైనా పడాలి. ఎందరి పాదాలైనా పట్టుకోవాలి. ఎందరి చేతనైనా తిట్లు తినాలి. బీదవాణ్ణి ప్రతీవాడు నీచంగా చూస్తాడు. వారిని మనుష్యుల కింద పరిగణించరు.

మామూలు ప్రకారం ఒకనాడు సాయంకాలం మధుసూదనుని గదికి వెళ్లేను. ఆనాడు రోజూ కన్న జ్వరం, దగ్గూ, నీరసం హెచ్చుగా వున్నాయి. స్పష్టంగా మాటలాడలేకపోయేడు. ఏదో చేతుల్తో సంజ్ఞ చేసేడు కాని నాకేమీ అర్థమవలేదు. "ఏమైనా కావాలా?" అని అడిగేను. "లలిత" అన్న ముక్క అతి ప్రయాసతో నోటినుంచి వెలువడ్డది. వాని భావం గ్రహించేను. వాని జీవిత సమాప్తి సమీపిస్తూంది. లలితని ఒక్క పర్యాయం చూడడం వాని కడసారి కోరిక. అది తీరకపోతే వానినే కాదు నన్ను ఆజన్మాంతం అది వేధిస్తూ వుంటుంది. నేనే లలితని పిలవడానికి వెళ్లేను. కాని ఆమె ఇంటిలో లేదు. నిరాశతో తిరిగి మధుసూదనుని దగ్గరకు వచ్చాను. ఆ సాయంకాలపు దృశ్యం నేనెన్నటికీ మరువలేను. తలుపు చప్పుడు కాగానే బరువైన కళ్లు నావైపు త్రిప్పేడు. కాని అవి నావైపు కావు, నా వెనుక ఎవరైనా వున్నారేమో అని ఆతృతతో చూస్తున్నాయి. లేకపోవడం చూచి నిస్పృహతో తిరిగి మూసుకున్నాయి. మంచాన్ని సమీపించి 'లలిత ఇంటిలో లేద'ని చెప్పేను. నా మాటలేవీ వాని చెవిన పడలేదు. కిటికీ ద్వారా వాని ముఖం మీద పడుతున్న సూర్య కిరణాల కాంతి క్రమంగా క్షీణించిపోతూంది. దానితో పాటు నా స్నేహితుని ముఖకాంతి కూడా మెల్లమెల్లగా అదృశ్యమయిపోయింది".

ఈరీతిగా చెప్పి కృష్ణారావు వూరకున్నాడు. వాని కళ్లంట దుఃఖాశృవులు రాల్తున్నాయి. కొంతసేపటికి గొంతు సవరించుకొని చెప్పడం ప్రారంభించేడు.

"పోనీ, విశ్వాసరావుని వివాహమాడిన లలిత ఏమైనా సుఖపడ్డదా? విశ్వాసరావు ధనవంతుడే. కాని ధనంతో సుఖం వస్తుందా? అదే నిజమయినట్లయితే ప్రపంచములో వున్న ధనికులంతా సుఖంగా వున్నారా? లలిత మాటా అంతే; ధనంతో పాటు సౌఖ్యం కూడా వస్తుందనుకుంది. కాని తన ఊహ పొరపాటని త్వరలోనే తెలుసుకోగలిగింది. చదువూ, సంధ్యా లేదు. సుగుణమన్నది ఏ కోశాన్ని వెదకినా లేదు. లలితని ప్రారంభం నుంచీ ఏవగించుకునేవాడు. ఆమె సౌందర్యం వాని నాకర్షించలేదు. అతడు లలితను వదలి రామామణి వలలో చిక్కుపడ్డాడు. క్రమంగా మద్యం అలవడ్డది. లలితకి అతనిని చూడడమే అరుదై పోయింది. ఇంటికి వచ్చినప్పుడు ఈ చెడు బుద్ధుల మానమని చెప్పేది. దానికి బహుమతి తిట్లు తన్నులు.

(x) సంతకాల ప్రమాదం కొన్ని వున్నాయి. దానిచేతుల్లో పైపోయేరు.

క్రమంగా పది పన్నెండు సంవత్సరాలు గడిచేయి. ఇలాంటి ఇద్దరు కుమారులు. మోహనుడు, రామారావు. విశ్వనాథరావు అగచాట్లు పెట్టినా ఓర్పుగా భరించి కాలం గడుపుతూ వుండేది! కాని భర్త పెట్టే బాధలు ఎక్కువైనవి (x) ఉన్నదంతా తాగుడుకు తెగ తగలెట్టి కొంత పోగొట్టేడు. పొలాలు సారా క్రింద వెళ్ళిపోయేయి. అప్పులవాళ్ళు భూములు ఇళ్ళు వేలం వేసి ఇంట్లో పాత్ర సామగ్రి వరకు అన్నీ అమ్మివేశారు. ఈ వ్యవహారమంతా చూసి రామారావుని గడప త్రొక్కనివ్వలేదు. ఆక్రోశం మీద భార్య పైన అన్నది ఆమెని, పిల్లల్ని రాత్రి వీధిలోకి నెట్టివేశాడు. అప్పుడు నేను సిరిపురం నుంచి వస్తున్నాను. అది చలికాలం. అందులోనూ ఆ నాడు చలి మరీ ఎక్కువగా ఉంది. మంచు దట్టంగా కురుస్తోంది. లలిత, రామారావు ఒళ్ళమీద పడి ఏడుస్తున్నారు. ఇదంతా చేసినా ఆ దుర్మార్గుడు కొట్టిన దెబ్బలవల్ల కాళ్ళు రక్తాలు కారుతున్నాయి. మోహనరావు ఎక్కడా కనిపించలేదు. వాళ్ళని నా నివాసానికి తీసుకుని వచ్చి నా భార్యచేత ఉపచారాలు చేయించేను. ఆ మర్నాడు కూడా మోహనరావు కనిపించలేదు. తండ్రి పెట్టిన బాధలు సహించలేక దేశాల పాలయి పోయేడు.

గోరుచుట్టు మీద రోకటి పోటులాగ ఈ దెబ్బతో లలిత భూపతి క్షయి పాలయింది. ఇద్దరు కుమారులను చూసుకుని ఆనందించే ఆమెకి ఇక దుఃఖం తప్ప సుఖం ఎక్కడిది?

ఈ విషయం ఇలా గుండగా ఒక నాడు విశ్వనాథరావు ఒక్కసారిగా చనిపోయేడు. దానితో లలిత కష్టాలు తీర్న గట్టెక్కుతాయనుకున్నాను. కాని నా ఊహ పొరపాటు. ఆమె కష్టాలు ద్విగుణీకృతమయ్యాయి. తినటానికి తిండి లేదు. కట్టడానికి గుడ్డ లేదు. వుండటానికి ఇల్లు లేదు. ఒక కుమారుడు దేశాంతరగతుడై పోయేడు. రెండవ కుమారుని వల్ల సుఖం లభిస్తుందనుకున్నాను. కాని విధి దానిని కూడా ఆమెకు దూరం చేసింది. టైఫాయిడ్ జ్వరం వచ్చి పదిహేను సంవత్సరాల తెలివైన రామారావు మంచం పట్టేడు. ఈ దుఃఖం లలిత సహించలేక పోయింది. నిన్నటినుండి ఆమెనెవరూ చూడలేదు. ఇప్పుడు ఆమె శవం సముద్రంలో తేలింది.

కృష్ణారావు ఏదో ఆలోచిస్తూ విచారంగా కూర్చున్నాడు. నేను మెల్లగా బయటికి వచ్చాను.

-x-

చిత్రగుప్త పక్షపత్రిక 1.12.1938 సంచిక బలసాని ప్రసాద్ సేకరణ. 5.8.1988 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో పునర్ముద్రితము.